



గంగమ్మ ఆలయానికి తరలివచ్చిన భక్తులు

అర్ధరాత్రి అభిషేకం

తిరుపతి గంగజాతరకు చాటింపు అనంతరం వివిధ వేషాలలో మునిగితేలిన గంగమ్మకు సోమవారం అర్ధరాత్రి తర్వాత విశిష్ట అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సర్వాలంకారశోభితమైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు. అర్ధరాత్రి నుంచే కొందరు భక్తులు పొర్లు దండాలు పెట్టుకుంటూ, వేషాలు వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపతి గంగజాతర ఒక్క తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోనే పరిమితం కాకుండా స్థానికంగా ఉన్న టీపీ ఏరియాలో తాళ్లపాక పెదగంగమ్మ, చింతలచేనులో ముత్యాలమ్మ, కుమ్మరితోపులో నేరేళ్లమ్మ, దాసరిమఠంలో మాతమ్మ, పల్లెవీధిలో వేశాలమ్మ, చింతకాయవీధిలో కరిమాను గంగమ్మతో పాటు చిన్న గంగమ్మ ఆలయంలోనూ జాతర సంబరాలు కనిపించాయి. దీంతో నగరమంతా జాతర సందడి కనిపిస్తోంది.

నేడు తిరుపతి జాతర

పోటెత్తుతున్న భక్తులు ● వజ్రకిరీటంలో వెలిగిన గంగమ్మ

తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఊరంతా జాతర సందడి నెలకొంది. అమ్మలుగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లుతోంది. సోమవారం ఉదయం నుంచి ఓమోస్తరుగా రద్దీ ఉన్నప్పటికీ రాత్రి నుంచే గంగమ్మ ఆలయానికి భక్తులు బారులు తీరారు. చిత్ర, విచిత్ర వేషాలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. పల్లివీధిలోని వేశాలమ్మకు మంత్రి కొల్లు రవీంద్ర సారె అందజేశారు. కమిషనర్ మౌర్య నేతృత్వంలో తిరుపతి నగరపాలక సంస్థ, తుడా అధికారులు, సిబ్బంది అమ్మవారికి సారె సమర్పించారు. శ్రీవారి ఆలయానికి పరదాలు అందించే మణి గంగమ్మ ఆలయానికి కూడా పరదాలతో పాటు తాత్కాలిక హుండీ క్లాత్‌ను ఈవో జయకుమార్‌కు అందజేశారు.



సారె తెస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర



అర్ధరాత్రి దాటాక గంగమ్మకు విశిష్ట అభిషేకం



పూజలందుకున్న సున్నపు కుండలు

సోమవారం సాయంత్రం వేశాలమ్మ ఆలయంలో కైకాల వంశస్థులు ఇద్దరు సున్నపు కుండలను ధరించారు. అక్కడ నుంచి నగరంలోని ప్రధాన వీధులలోని ఇళ్లకు వెళ్లి హారతులందుకున్నారు. సున్నపుకుండల వేషధారులను భక్తులు కుర్చీలో కూర్చోబెట్టి పాదపూజ చేసిమొక్కులు తీర్చుకున్నారు. బుధవారం వేకువజాము వరకు వీళ్లు ఊరంతా తిరిగి పూజలందుకోనుండటం విశేషం.

నేడు పేరంటాల వేషం

పేరంటాల వేషాన్నీ కైకాలవాళ్లే ధరిస్తారు. ఎర్రగళ్ల చీర, ఎర్రని గుడ్డలో ఒడిబాలను కట్టుకుంటారు. అందులో అక్షింతలు, చవ్వాకు, దువ్వెన, అద్దం, నల్లగాజులు, పసుపు, కుంకుమ ఉంచుతారు. తలకు నల్లని గుడ్డను కట్టి కొప్పులా ముడివేసుకుంటారు. తలపై బంగారంలా కనిపించే అట్టతో చేసిన జడ బిళ్లలు, పట్టీలు వంటి ఆభరణాలు కట్టుకుంటారు. పంబల వాయిద్యాలతో చాటు మండపం వద్దకు వెళ్లిన తరువాత బేరిశెట్టి ఇంటికి వెళ్లి అక్కడనుండి మరికొన్ని చోట్లకు వెళ్లి పేరంటాలు పూజలు అందుకుంటారు. అక్కడ్నుంచి బుధవారం వేకువజామును చిన గంగమ్మ చెంప నరికిన తర్వాత పెద గంగమ్మ చెంపను నరకడంతో జాతర సంబరం ముగుస్తుంది.

నిరంతర పర్యవేక్షణ : కమిషనరు మౌర్య

గంగజాతర సందర్భంగా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మున్సిపల్ సిబ్బందితో పాటు సచివాలయ ఉద్యోగులూ విధుల్లో ఉంటారు. కూరగాయల మార్కెట్లో పొంగళ్లు పెట్టుకోవచ్చు. మంగళవారం వేకువన 3 గంటల నుంచే భక్తులకు దర్శనం ఏర్పాటుచేశాం. వీఐపీ పాసులు వుండవు. లక్ష మందికిపైగా భక్తులు దర్శనం కోసం వస్తారని అంచనా.



స్వర్ణరథంపై ఊరేగుతున్న పద్మావతిదేవి అమ్మవారు - ప్రత్యేక అలంకారంలో శ్రీవారి దేవేరి(ఇన్‌సెట్లో)

స్వర్ణరథంపై సిరులతల్లి అభయం

● నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం

తిరుచానూరు, మే 12(ఆంధ్రజ్యోతి): వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం మహాలక్ష్మి అలంకారంలో పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అమ్మవారి ఉత్సవర్లను స్వర్ణరథంపై కొలువుదీర్చారు. 9.45 గంటలకు భక్తుల గోవిందనామ స్మరణల నడుమ స్వర్ణ రథోత్సవం మాడవీధుల్లో ప్రారంభమైంది. రథం లాగడానికి మహిళలు పోటీపడ్డారు. మధ్యాహ్నం ఫ్రైడే గార్డెన్‌లో అమ్మవారికి స్నపన తిరుమంజనం.. రాత్రి వీధోత్సవం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టీటీడీ ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, ఏఈవో దేవరాజులు, అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సర్పంచులకు గౌరవ వేతనం వచ్చిందోచ్

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 774 గ్రామ పంచాయతీలకుగాను 2025-26మొదటి త్రైమాసం కింద రూ.1.46కోట్లువచ్చినట్లు గ్రామపంచాయతీ అధికారి సుశీలాదేవి సోమవారం తెలిపారు.అందులో 745 మంది సర్పంచులకు గౌరవ వేతనంకింద రూ.96.56లక్షలు, తలసరి ఆదాయానికి రూ.14.55 లక్షలు, వృత్తి పన్నుకు రూ.35.02లక్షలు చొప్పున విడుదలైనట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ ఖాతాలకు ఈ నగదు జమవుతుందన్నారు.

పోలీసులే బాధితులు!

మరి నిందితులెవరు?

● జిల్లా పోలీసు సహకార సొసైటీలో రూ.80 లక్షల దుర్వినియోగం

● విచారణకు ఆదేశించిన ఎస్పీ

నష్టపోయిన వారికి న్యాయం చేసే.. చేయాల్సిన పోలీసులే బాధితులుగా మారారు. పోలీసు సహకార సొసైటీ నుంచి తీసుకున్న రుణాలను త్వరగా తీర్చేయాలని జీతాలతో సంబంధం లేకుండా కంతులు కడుతూ వచ్చారు. అలా కట్టిన డబ్బులు సొసైటీకి జమకా లేదు. దాదాపు రూ.80 లక్షల వరకు దుర్వినియోగమైనట్లు తేలింది. పోలీసులను బాధితులు మార్చిన ఈ ఘటనలో నిందితులు ఎవరో తేలాల్సి ఉంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



చిత్తూరు కేంద్రంగా ఉమ్మడి జిల్లా పోలీసు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉండేది. ఆ తర్వాత తిరుపతి పోలీసు జిల్లా ఏర్పడటంతో 2014లో తిరుపతిలో జిల్లా పోలీసు సహకార సొసైటీని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ సొసైటీ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సభ్యులుగా కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్ఐల వరకు దాదాపు 2830 మంది ఉన్నారు. సభ్యుల జీతం బేసిక్‌లో నుంచి రూ.1000 నుంచి రూ.5000 వరకు ఈ సొసైటీలో పొదుపు చేస్తారు. ఇలా నెలకు దాదాపు రూ.86 లక్షల వరకు పొదుపు అవుతున్నట్లు సమాచారం. ఇలా పొదుపు చేసిన మొత్తం నుంచి అవసరమైన పోలీసులకు రుణాలు మంజూరు చేస్తారు. ఈ రుణం కనిష్ఠంగా రూ.3 లక్షల నుంచి రూ 5 లక్షల వరకు ఏడాదికి 12 శాతం లెక్కన వడ్డీ కింద మంజూరు చేస్తారు. తీసుకున్న రుణాన్ని 50 నెలల వ్యవధిలో తిరిగి చెల్లించాలి. దీంతో పాటు సొసైటీలో పోలీసులు పొదుపు చేస్తున్న డబ్బులకు సంబంధించి 11 శాతం కింద వడ్డీ చెల్లిస్తున్నారు. మిగిలిన ఒక శాతం సొసైటీ నిర్వహణకు ఉంచుతారు. ఇలా దాదాపు 11 ఏళ్లుగా ఎలాంటి ఒడిదుడుకులు, అవకతవకలు లేకుండా నిర్వహిస్తూ వచ్చారు. ఒక వేళ సకాలంలో తిరిగి రుణాలు చెల్లించని వారికి మళ్లీ కొంత గడువిచ్చి చెల్లించాలని విజ్ఞప్తి చేస్తారు.

అక్రమాలు జరిగిందిలా..

సభ్యులు తీసుకున్న రుణాలను గతంలో జీతాల బిల్లుల నుంచి నేరుగా రికవరీ చేసేవారు. ఇటీవల రెండేళ్లుగా పోలీసులు వారి అవసరాలకు తీసుకున్న రుణాల్లో 12 శాతం వడ్డీ కింద అసలు, వడ్డీ లెక్క కట్టి ప్రతి నెలా జీతాలతో సంబంధం లేకుండా చెల్లిస్తూ వస్తున్నారు. ఇలా చెల్లించిన డబ్బులను కొంత మంది అధికారుల చనువు, సొసైటీ నాయకత్వంలోని కొందరి సహకారంతో అక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ హోదాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఒకరు సొసైటీ ఖాతాలో జమ చేయలేదని తెలిసింది. ఐదేళ్లుగా లావాదేవాలపై ఆడిట్ జరగకపోవడం వీరికి కలిసొచ్చింది. ఇలా దాదాపు రూ.80 లక్షలను దుర్వినియోగం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేపింది. ఈ సొసైటీలో ఎలాంటి ఆడిట్ కూడా జరగనట్లు సమాచారం.

విచారణకు ఆదేశించిన ఎస్పీ

పోలీసు సహకార సొసైటీలో రూ.80 లక్షల దుర్వినియోగంపై ఎస్పీ హర్షవర్ధనరాజు విచారణకు ఆదేశించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, నాయుడుపేట డీఎస్పీ శేషుబాబును విచారణాధికారులుగా నియమిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సొసైటీలో నిధుల దుర్వినియోగానికి కారకుడన్న ఆరోపణలున్న జూనియర్ అసిస్టెంట్ హోదాలోని వ్యక్తిని తొలగించారు. కానిస్టేబుల్ రవికి ఆ బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలిచ్చారు. 'ఈ ఘటన వెనుక ఎవరెవరు ఉన్నారనేది విచారణలో తేలుతుంది. దీనిపై నివేదిక అందాక తదుపరి చర్యలు తీసుకుంటాం' అని ఎస్పీ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

అమ్మో.. అంత జీతమా?

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ కింద ఎవరినైనా ఉద్యోగంలోకి తీసుకుంటే ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు జీతం ఇస్తుంది. ఇక్కడి సొసైటీలో మాత్రం జూనియర్ అసిస్టెంట్ హోదాలో ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి రూ.95 వేల జీతం చెల్లిస్తున్నారు. ఈ విషయం తెలిసి ఎస్పీ హర్షవర్ధనరాజు ఆశ్చర్యపోయారు. జిల్లా స్థాయి అధికారులకు కూడా అంత జీతాల్లేవు కదా అని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. దీనిపై ఏవోను పిలిపించి అడగ్గా.. అంత జీతం ఇస్తున్నట్లు ఆయన చెప్పారు.

తిరుపతి జాయింట్ రిజిస్ట్రార్‌పై వేటు



చిత్తూరు కలెక్టరేట్/తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఈ ఏడాది మొదట్లో రిజిస్ట్రేషన్ చేసి ప్రభుత్వాదాయానికి గండి కొట్టిన తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 నీరజను శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేసినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ గిరిబాబు సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి శివజ్యోతి నగర్‌లోని ప్రధాన రోడ్డుకు అనుబంధంగా ఉన్న కొన్ని గజాల స్థలాన్ని కాకుండా అదే భవనంలోని మిగిలిన కొంత స్థలాన్ని రెసిడెన్షియల్ పరిధి కింద సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ నిబంధనలమేర ఆ స్థలం మొత్తాన్ని కమర్షియల్‌గా చూపించాల్సి ఉండగా, రెసిడెన్షియల్ పరిధిలో చూపి తక్కువ రిజిస్ట్రేషన్ చార్జీలు వసూలు చేశారు. దీనివల్ల రూ.82 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం తగ్గింది. ఈ రిజిస్ట్రేషన్‌పై అందిన ఫిర్యాదు మేర మార్కెట్ వ్యాల్యూ ఆడిట్ డీఆర్ (ఏపీ ఏడీఆర్) మునిశంకరయ్య క్షేత్రస్థాయి పరిశీలన చేసి సబ్‌రిజిస్ట్రార్-1 నీరజ చేసిన అక్రమం నిజమేనని నిర్ధారించారు. ఈ మేరకు నివేదిక అందించడంతో ఆమెను సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేసినట్లు డీఐజీ గిరిబాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆమె స్థానంలో కొత్తవారిని నియమించేవరకు తిరుపతి ఆర్వోలో పనిచేస్తున్న జాయింట్-2 సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మీదేవి జాయింట్-1గా కొనసాగుతూ రిజిస్ట్రేషన్లకు ఎటువంటి ఇబ్బందిలేకుండా విధులు నిర్వహిస్తారని డీఐజీ పేర్కొన్నారు. కాగా, పీలేరు నుంచి ఇటీవల బదిలీపై తిరుపతి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకున్న నీరజ ఆడిట్ తనిఖీలో దొరికిపోయారు. కొన్ని రోజులుగా సెలవులో ఉన్న ఆమెపై ఆరు నెలల పాటు సస్పెండు వేటు పడింది.

వైభవంగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



చంద్రగిరి, మే 12(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి గరుడోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఉత్సవమూర్తిని పట్టుపీతాంబురాలు, బంగారు ఆభరణాలతో విశేషంగా అలంకరించారు. తన ప్రీతి పాత్ర గరుడ వాహనంపై స్వామి అధిష్ఠించారు. మాడ వీధుల్లో గోవింద నామస్మరణల నడుమ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

తొండవాడ టీడీపీ కమిటీ ఎన్నిక



ఉమాపతిరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, మే 12(ఆంధ్రజ్యోతి): తొండవాడ పంచాయతీ టీడీపీ గ్రామ కమిటీని ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఉమాపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడిగా సుదర్శన్‌ను, కమిటీ సభ్యులను ఏకగ్రీవకంగా ఏన్నుకున్నారు. అనంతరం ఉమాపతిరెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, పార్టీ సీనియర్ గిరిధర్‌రెడ్డి, పులికంటి మోహన్‌రెడ్డి, జగన్మోహన్‌నాయుడు, శంకరయ్య, బాలకిషోర్, శేఖర్, రఘు యాదవ్, లోకాచారి, పరుశురామయ్య, పృధ్వీ, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో గట్టి నిఘా: సీఐ



డ్రోన్ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ

చంద్రగిరి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం పత్తిగుట్ట సమీపంలో డ్రోన్ కెమెరాలతో పరిసర ప్రాంతాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఇకపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంటుదన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాల కట్టడికి ఇవి దోహదపడతాయన్నారు. ఎస్ఐ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ



పాకాల, మే 12 (ఆంధ్రజ్యోతి): కె.వడ్డేపల్లె పశువైద్య కేంద్రం పరిధిలోని ఎస్సీ, ఎస్టీ పాడిరైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. సోమవారం పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్, పశువైద్యాధికారి డాక్టర్ మోహన్ కుమారి, మండల టీడీపీ నాయకులు లబ్ధిదారులకు 50 శాతం రాయితీతో రూ.555లకు బస్తా చొప్పున అందజేశారు. మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు,సర్పంచ్ కె.వరలక్ష్మీ, నాయకులు కె.సావిత్రి, మహేష్ కుమార్, పల్గుణ, కె.సుధాకరయ్య పాల్గొన్నారు.

నేడు పాకాలలో సత్యమ్మతల్లి గంగజాతర

పాకాల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సత్యమ్మతల్లి గంగజాతర మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం అమ్మవారి ప్రతిమ ప్రతిష్ఠాపన తర్వాత పొంగళ్లు, అంబలి నైవేద్యం సమర్పించనున్నారు. ఈ సందర్భంగా గుడి పరిసర వీధుల్లో విద్యుద్దీపాలంకరణలు చేశారు. వేపాకు తోరణాలు కట్టారు. గుడివద్ద చలువ పందిళ్లు వేశారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని ఊరేగిస్తారు

ఏఐవైఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పాకాల, మే 12 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలకు తరలివచ్చి జయప్రదం చేయాలని సమాఖ్య జిల్లా నాయకులు శ్రీరాములు, ప్రకాష్ కోరారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహిస్తున్న మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో వారు ఆవిష్కరించారు. సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.

వైభవంగా కలశ స్థాపన పూజలు

భాకరాపేట, మే 12(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు అనుముల బండపై వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక ఉత్సవాలలో భాగంగా సోమవారం ప్రధాన దేవతా కలశ స్థాపన ఏర్పాటు చేశారు. ఉదయం గంగపూజ, గోపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, వాస్తుపూజ హోమం, యాగశాల ప్రవేశం, ప్రధాన దేవత కలశ స్థాపన పూజలు నిర్వహించారు. మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలను ఆలయ నిర్వాహకులు పంపిణీ చేశారు.

పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రామచంద్రాపురం, మే 12(ఆంధ్రజ్యోతి): పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. సోమవారం కమ్మపల్లి, కుప్పంబాదూరు పశువైద్యశాలల పరిధిలో 50శాతం రాయితీతో పశువుల దాణాను ఎస్సీ, ఎస్టీ రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాగడుతూ ఎమ్మెల్యే పులివర్తి నాని మండలానికి 325 బస్తాలను పశుసంవర్ధక శాఖ ద్వారా మంజూరు చేయించారన్నారు. ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు బస్తా దాణాను రూ.555కు అందజేస్తున్నట్లు కమ్మపల్లి పశువైద్యశాఖ అధికారి డాక్టర్ జయకిషోర్ తెలిపారు. రెండవ విడత బీసీ, ఓసీ పాడిరైతులకు సబ్సిడీ దాణాను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కోరా హరిప్రసాద్, సురేంద్రనాయుడు, ధనంజయులు, వెంకటప్రసాద్, శేఖర్‌నాయుడు, మధుబాబు, చిరంజీవి, మహేష్‌నాయుడు,దేవరాజులు,విజయకుమార్‌రెడ్డి,రమణారెడ్డి,కుప్పారెడ్డి,డాక్టర్ హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

రామచంద్రాపురం, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ బ్రహ్మనందరెడ్డి కోరారు. మండలసర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో ఫారం ఫాండ్ వంటి పనులను యంత్రాలతో నిర్వహించకూడదన్నారు.తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది అందుబాటులోఉండాలని సర్పంచులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దారు వెంకటరమణ, జడ్పీటీసీ డిల్లీరాణి, ఎంపీడీవో ఇందిరమ్మ పాల్గొన్నారు.

సేద్యానికి నాణ్యమైన విద్యుత్ అందించండి

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నాణ్యమైన, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యుత్‌శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. 381కి సంబంధించి 11కేవీ అగ్రికల్చర్ ఫీడర్ల నుంచి గృహ, వాణిజ్య, పరిశ్రమల సర్వీసులను వేరు చేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో నష్టాలను తగ్గించడమే ప్రధానమంత్రిక ఇసార్ ఊర్జా సురక్ష పథకం లక్ష్యమన్నారు. జిల్లాలో 15సబ్‌స్టేషన్ల కింద 54 ఫీడర్లలో ఉన్న 6,213 వ్యవసాయ పంపుసెట్లకు 142 ఎకరాల ప్రభుత్వ భూములలో పీఎం కుసం ద్వారా 28 మెగావాట్ల సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఐదు డివిజన్ల పరిధిలోని 33/11కేవీ స్టేషన్లకు ఉన్న 14 ప్రాంతాలను గుర్తించి 142 ఎకరాలను ఇవ్వమని వారు కలెక్టర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సదరన్ డిస్కం ఎస్ఈ సురేంద్రనాయుడు, ఈఈలు వాసవి లత, బాలాజీ పాల్గొన్నారు.

తిరుపతి(ఆర్టీసీ): డీపీటీవోగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజును వేర్వేరుగా కలిశారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు జిల్లా ప్రజా రవాణా విభాగానికి సహాయ సహకారాలు అవసరమని కోరారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, సీఎంఈ బాలాజీ ఆయన వెంట ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



మృతి చెందిన కేశవులు

చంద్రగిరి, మే 12(ఆంధ్ర జ్యోతి): పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు అగరాలకు చెందిన కేశవులు(54) సోమవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకోవడానికి జాతీయ రహదారి దాటుతున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి అతడ్ని ఢీకొంది. దీంతో కేశవులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని చంద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు ఢీకొని లారీ డ్రైవర్ దుర్మరణం

చంద్రగిరి, మే 12(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు చిత్తూరుకు చెందిన కోదండరామన్(72) లారీ డ్రయివర్. ఇతడు తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్తూ గాదంకి టోల్ ప్లాజా వద్ద రోడ్డు పక్కన లారీ ఆపి టీ తాగడానికి రోడ్డు దాటుతున్నాడు. తిరుపతి నుంచి చిత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో అతివేగంగా దూసుకెళ్ళి కోదండరామన్‌ను ఢీకొన్నారు. తీవ్రంగా గాయపడిన కోదండరామన్‌ను రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుచానూరులో టైలర్ ఆత్మహత్య



మృతుడు రత్నం

తిరుచానూరు, మే 12(ఆంధ్రజ్యోతి): ఓ టైలర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం తిరుచానూరులో నాగరత్నం అలియాస్ రత్నం(53) కొన్నేళ్లుగా టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను యోగిమల్లవరంలోని పొక్కాలమ్మ ఆలయం సమీపంలో ఉంటున్నాడు. శనివారం రాత్రి స్థానికులతో గొడవ పడినట్లు తెలిసింది. తిరుపతిలోని కుమారునికి ఆదివారం రాత్రి ఫోన్ చేశాడు. సోమవారం ఉదయం ఇంటి తలుపు తెరవకపోవడంతో స్థానికులు వచ్చి చూడగా రత్నం ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్నట్లు గమనించారు. తలుపు తాళాలు వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. మృతుడు గతంలో భార్య హత్యకేసులో జైలుశిక్ష కూడా అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. కారణాలపై విచారిస్తున్నామన్నారు.

కారులో సెక్యూరిటీ గార్డు శవం

తిరుచానూరు, మే 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని ప్రయివేట్ విద్యాసంస్థలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న రవీంద్ర(55) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఇతనిది అన్నమయ్యజిల్లా పుల్లంపేట మండలం. శనివారం తన రూముకు వెళుతున్నానని కళాశాల సిబ్బందికి చెప్పి వెళ్లాడు. సోమవారం విధులకు వచ్చిన అధ్యాపకులు, సిబ్బంది అక్కడ ఓ కారు నుంచి దుర్వాసన రావడంతో లోపలికి చూశారు. రవీంద్ర మృతదేహం కనబడటంతో తిరుచానూరు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ జగన్నాథరెడ్డి, సిబ్బంది చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కారులోనే రెండు రోజులు ఉండటంతో మృతదేహం ఉబ్బిపోయింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పు చేయకుంటే విచారణకు సహకరించాలి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న శంకరరెడ్డి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 12(ఆంధ్రజ్యోతి): తుమ్మలుగుంట కేవీఎస్ పార్కుకు రూ.22 కోట్లు మళ్లింపు విషయంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రజలను రెచ్చగొడుతున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వరరెడ్డి ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తప్పు చేయకుంటే చెవిరెడ్డి విచారణకు సహకరించాలన్నారు. రెండు పర్యాయాలు తుడా చైర్మన్‌గా పనిచేసి ఇప్పుడు కేవీఎస్‌పార్కును తుడాకు అప్పగిస్తుంటే ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. తుడా నిధుల గోల్‌మాల్‌పై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన క్రమంలో కేవీఎస్ పార్కుకు తుడా నుంచి రూ.22కోట్లు గ్రామపంచాయతీ ఖాతాకు మళ్లించడంపై సందిగ్ధత ఏర్పడిందన్నారు. సమావేశంలో నాయకులు గణపతినాయుడు, కత్తి సుధాకర్, శ్రీనివాసులు, మునిశేఖర్‌రాయల్, సుధ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి



మృతుడు శేఖర్

తిరుపతి(నేరవిభాగం), మే 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో డ్రైవర్ మృతి చెందిన ఘటన తిరుపతిలో సోమవారం చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు వివరాల మేరకు... ఐరాల మండలం మద్దిపట్లపల్లికి చెందిన శేఖర్(50) తిరుపతి వీఆర్ఎల్ పార్శిల్ సర్వీసులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పార్శిల్ అన్‌లోడు చేసి వాహనాన్ని ఎస్వీఎస్ కళాశాల వద్ద పార్కింగ్ చేయడానికి వెళ్లాడు. అక్కడ పైనున్న విద్యుత్ వైర్లు వాహనానికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ గిరిబాబు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు 238 వినతులు

● ఎండను లెక్క చేయకుండా కలెక్టరేట్‌కు క్యూ కట్టిన అర్జీదారులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): వడగాడ్పులు... ఎండవేడిమి... ఉక్కపోత ఇవన్నీ లెక్కచేయకుండా తమ సమస్యలపై వినతులు అందించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచే పీజీఆర్ఎస్ ప్రారంభమైంది. ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 238 వినతులు రాగా అందులో భూసమస్యలపై 142 ఉన్నాయి.

ఆగిన లిఫ్ట్

కలెక్టరేట్‌లో రెండు లిఫ్టులు మరమ్మతులకు గురికావడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. అసలే సోమవారం కావడంతో పీజీఆర్ఎస్‌లో వినతులు సమర్పించేందుకు పెద్దయెత్తున ప్రజలు వచ్చారు. లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు ఇబ్బందిపడ్డారు. తరచూ మరమ్మతులకు గురవుతున్న లిఫ్టులపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

దాడి చేసినా పట్టించుకోలేదు

అవిలాల గ్రామ పంచాయతీలో పలు విభాగాల్లో తాము పనిచేస్తున్నామని, ఐదు రోజుల క్రితం గంగ జాతర రోజున పారిశుధ్య పనులు చేస్తుండగా 20 మంది తమపై దాడి చేశారని పంచాయతీ సిబ్బంది జ్యోతి, తులసమ్మ, వెంకటమ్మతో పాటు పలువురు కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మార్‌పల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. ఆదివారం విధులకు వెళ్లగా సదరు వ్యక్తులు తమను చంపేస్తామని బెదిరించారని వాపోయారు. రక్షణ కల్పించాలని కోరారు.

ఉపాధి కల్పించి ఆదుకోండి

అయ్యా నేను దివ్యాంగురాలిని. వీల్‌చైర్‌కే పరిమితమయ్యాను. ఏ పనీ చేయలేను. నాకు ఇద్దరు పిల్లలు. దివ్యాంగుల కోటా కింద ఉపాధి కల్పించి ఆదుకోండి. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మీరైనా న్యాయం చేయండి.

- ఉమ, పద్మావతీపురం

వికలాంగ పింఛన్ ఇవ్వండి

పుట్టుకతో అంధురాలిని. అమ్మ, నాన్న కటిక పేదరికంతో జీవిస్తున్నారు. ఇంట్లో నుంచి కాలు బయట పెట్టాలన్నా ఎవరో ఒకరి సాయం అవసరం. దివ్యాంగులకు ఇచ్చే పింఛను ఇప్పించి ఆదుకోండి.**- మహేశ్వరి, ఎస్వీనగర్, తిరుపతి**

అన్నమయ్య కీర్తనలతో శ్రీవారి కీర్తి విశ్వవ్యాప్తం



అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 12 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంకీర్తనలను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలని అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు - హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలు తిరుపతి అన్నమయ్య కళా మందిరంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. శ్రీవారి కీర్తిని తన కీర్తనల ద్వారా అన్నమయ్య విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. అన్నమయ్య కీర్తనల్లోని అంతస్సారాన్ని తెలుసుకొని అందులోని విలువలను ఆచరించాలన్నారు. ఉదయం అన్నమాచార్య ప్రాజెక్టు,లావణ్య బృందం కళాకారులు 'హరిసరాత్ముకుడు, ఇంకనైనా కరుణించవేమయ్యా, పలు విచారములేల, ఏవందర్యయని తదితర కీర్తనలను ఆలపించారు. రెడ్డెమ్మ బృందం 'రాజసూయ యాగం' అనే హరికథను ప్రదర్శించింది. సాయంత్రం సుగుణమ్మ బృందం సంగీత కచేరి, వనజ కుమారి బృందం హరికథ అందరినీ ఆకట్టుకున్నాయి. తాళ్లపాకలోని ధ్యానమందిరంలో గోష్ఠి గానం, శ్రీనివాస శ్రీనివాస కల్యాణం నిర్వహించారు.

వారధికి ఏమైంది?

● మరమ్మతులు జరుగుతుండంతో వాహనదారుల ఆందోళన

● సాధారణ నిర్వహణలో భాగమేనంటున్న ఆఫ్కాన్స్



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, మే12 (ఆంధ్రజ్యోతి): అలిపిరి పోలీస్ స్టేషన్ సమీపంలోని గరుడ వారధిపై కొంతమేర రోడ్డు తవ్వేసి ఇనుప దిమ్మెలు కనిపించేలా మరమ్మతులు చేస్తుండడంతో అటుగా వెళ్లే వాహనదారుల్లో ఆందోళన నెలకొంది. 'వారధికి ఏమైంది..?' అంటూ చర్చించుకోవడం కనిపించింది. సమాచారం తెలుసుకున్న టీడీపీ నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, రవి నాయుడు, ఊక విజయ్ కుమార్, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, కొట్టే హేమంత్ రాయల్ తదితరులు వారధిని పరిశీలించారు. ఏదైనా మరమ్మతులు చేయాల్సినప్పుడు ముందస్తు సమాచారం ఇస్తే వాహనదారుల్లో ఆందోళన లేకుండా ఉంటుందని నిర్మాణదారులకు చెప్పారు. వారధి నిర్మాణ పనులకు అడుగడునా ఆటంకాలు సృష్టించిన గత వైసీపీ పాపాలే ఈ రూపంలో వెంటాడుతున్నాయని మండిపడ్డారు. దీనిపై వారధి నిర్మాణ సంస్థ మేనేజర్ రంగస్వామిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సాధారణ నిర్వహణలో భాగమేనని చెప్పుకొచ్చారు. వాహనాలు వెళుతున్నపుడు ఈ ప్రాంతంలో ఎక్కువ శబ్దం వస్తున్నట్టు నెలరోజులుగా గుర్తించామన్నారు.

వారధులపై వేసవి కాలంలో స్టీల్ వ్యాకోచించడం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయని, వాటిని గుర్తించి మరమ్మతులు చేయడం సాధారణమైన విషయమేనన్నారు. ఇది కేవలం సాంకేతికమైన అంశమేనని ఎవరూ ఆందోళన చెందవద్దని చెప్పారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా మరో నాలుగు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు.

మా గోడు పట్టించుకునేదెవరు?

● పోలీస్ పీజీఆర్ఎస్‌కు 86 వినతులు



పిర్యాదులు స్వీకరిస్తున్న పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 86 వినతులు అందాయి. తమ గోడు ఎవరూ పట్టించుకోవడంలేదని అదనపు ఎస్పీ ఎదుట పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో కొందరి వినతులను పరిశీలిస్తే..

నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేసేశారు

కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన సుబ్బమ్మ భర్త పేరున తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు వెనుక వైపు సర్వే నెంబరు 17బీ, 18బీలో 15 సెంట్ల ప్లాటు ఉంది. ఆయన మృతితో సుబ్బమ్మ పేరిట మార్చారు. ఈ ఆస్తిని ఇద్దరు పిల్లలకు రాసిచ్చారామె. 'కోడూరు చింతంనగర్‌కు చెందిన షేక్ జుబైర్ నకిలీ డాక్యుమెంట్ సృష్టించి పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతేడాది ఏప్రిల్ 6న రిజిస్ట్రేషన్ చేసుకుని.. ఆయన భార్య షేక్ గౌషియాకు గిఫ్ట్ డీడ్ చేసిచ్చారు. ఈ వ్యవహారంలో పాకాల సబ్ రిజిస్ట్రార్ హస్తం ఉంది' అంటూ బాధితురాలు సుబ్బమ్మ అదనపు ఎస్పీ నాగభూషణరావు ఎదుట ఆవేదన చెందారు. దీనిపై విచారించి ఆమెకు న్యాయం చేయాలని డీఎస్పీ భక్తవత్సలంను ఏఎస్పీ ఆదేశించారు.

నా భర్తను తీసుకెళ్లి హతమార్చారు

తన భర్తను తమ ప్రాంతానికి చెందిన కొందరు గత నెల 23న బయటకు తీసుకెళ్ళి హత్య చేశారని ఎర్రావారిపాలెం మండలం చింతగుంటకు చెందిన పుష్పలత ఆరోపించారు. దీనికి సంబంధించి ఫొటోల సహా ఆధారాలు, ఫిర్యాదును భాకరాపేట సీఐకి ఇచ్చినా, సరైన సమాధానం చెప్పడం లేదని అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి ఎదుట గోడు వెలిబుచ్చారు. దీనిపై ఆయన భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషాతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు సెక్షన్ మార్చి నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తన భర్త కరెంటు షాక్‌తో మృతి చెందినట్లు కేసు నమోదు చేశారని బాధితురాలు ఆరోపించారు.

బాధితులకు ఆర్టీసీ ఆర్థికసాయం



బాధితులను పరామర్శిస్తున్న డీపీటీవో

తిరుపతి(ఆర్టీసీ), మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయాలపాలై రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రజారవాణాధికారి వెంకటరావు సోమవారం మధ్యాహ్నం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్యులను సంప్రదించి మెరుగైన చికిత్స అందించాలని విజ్ఞప్తి చేశారు. సంస్థ తరఫున పది మందికి తక్షణ ఆర్థిక సాయం అందించారు. కాగా, ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు ప్రమాద ఘటనపై ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

ల్యాప్‌టాప్, స్మార్ట్‌ఫోన్ల అందజేత



ల్యాప్‌ట్యాప్, స్మార్ట్‌ఫోన్లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.13.92 లక్షల విలువ గల ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు అందజేశారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఏడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోవిందరాజస్వామికి పొన్నకాల్వ ఉత్సవం



తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు, మే 12(ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం గోవింద రాజస్వామి వారికి ఘనంగా పొన్నకాల్వ ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, ఆండాల్ అమ్మవార్లు, కృష్ణస్వామి, విష్వక్సేనులవారు తొమ్మిది మంది దేవేరులతో ఊరేగింపుగా తనపల్లి రోడ్డులోని పొన్నకాల్వ మండపానికి వేంచేపు చేసి కొలువుదీరారు. స్నపన తిరుమంజనానంతరం సేవాకాలం, శాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ, ఆస్థానం జరిగింది. సాయంత్రం 5గంటలకు గోవిందరాజస్వామి పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పూజాదికాలు ముగించుకుని గోవిందరాజస్వామివారిని తిరుపతిలోని ఆలయానికి వేంచేపు చేశారు. దీంతో పొన్నకాల్వ ఉత్సవం ముగిసింది. కార్యక్రమంలో జియ్యర్ స్వాములు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్లు శేషగిరి, చిరంజీవి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ విద్యార్థికి కొరియా వర్సిటీలో పరిశోధనావకాశం



స్కాలర్‌ను అభినందిస్తున్న వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ చదువుకున్న విద్యార్థి సీహెచ్ బ్రహ్మారెడ్డికి విదేశాల్లో పరిశోధన చేసే అవకాశం లభించింది. పరిశోధన సమయంలో నెలకు రూ.లక్ష స్కాలర్‌షిప్‌కు ఆయన ఎంపికయ్యారు. కొరియాలోని పూసన్ నేషనల్ వర్సిటీలోని కెమికల్ మెటీరియల్స్ డిపార్ట్‌మెంట్‌లో ఈయన పరిశోధన చేయనున్నారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, అభినందించారు.

ఘనంగా మొలకల పౌర్ణమి వేడుక



పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

ఎర్రావారిపాలెం, మే 12 (ఆంధ్రజ్యోతి) : కూరపర్తివారిపల్లెలో సోమవారం ఆరేటమ్మ ఆలయంలో ఘనంగా మొలకల పౌర్ణమి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టు వస్త్రాలను సమర్పించారు. చిత్తూరు,అన్నమయ్య,తిరుపతి జిల్లాల నుంచి భక్తులు వచ్చారు. గ్రామస్థులు 8 రోజుల నుంచి వివిధ రకాల చిరు ధాన్యాలను పోసి పౌర్ణమి రోజున అమ్మవారికి మొలకలు సమర్పించడం ఇక్కడి ఆనవాయితీ. బోణాలతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే నానికి కూటమి నాయకులు, అధికారులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాష్ట్ర రజక అభివృద్ధి సంఘం డైరెక్టర్ మధుసూదన్, ఎంపీటీసీ ఈశ్వరమ్మ దంపతులు రూ.50 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దాతలను అభినందించారు.

గంగమ్మా..చల్లగా చూడమ్మా..!

- సున్నపు కుండలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా చిన్నారుల వేషధారణ


అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ శిరీష

తిరుపతి(జీవకోన), మే 12(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా సోమవారం ఇద్దరు కైకాల కులస్థులు సున్నపు కుండల వేషధారణతో అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్ద, చిన్న గంగమ్మలకు ప్రతీకలుగా ఈ వేషాన్ని ధరిస్తారు. వీరు బయలుదేరి వచ్చే దారి పొడవునా ప్రతి ఇంటికీ వెళ్లి హారతులు అందుకుంటారు. ప్రత్యేకించి సున్నపు కుండల వేషధారులను భక్తులు కుర్చీలో కూర్చోబెట్టి వారి కాళ్లు కడిగి పాదపూజ చేసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఇలా పూజలు అందుకున్న వీరు చివరగా గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం పెద్దసంఖ్యలో భక్తులు వేషాలు ధరించి, అమ్మవారిని దర్శించుకున్నారు.

పారిశుధ్యం బేష్

నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఆదేశాలతో ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా నడుస్తోంది. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ సారథ్యంలో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నారు.

పోలీసుల నిరంతర పర్యవేక్షణ

పోలీసులు అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అనుమానం వస్తే ఫింగర్ ప్రింట్ సిస్టంతో వివరాలు సేకరిస్తున్నారు. చోరీలు, తొక్కిసలాటలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

నేడు తిరుత్తణిలో ఎమ్మెల్యే పూజలు

తిరుపతి అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో పోరాడుతున్న సైనికులకు దైవబలం మెండుగా ఉండాలని కోరుతూ మంగళవారం ఉదయం 8 గంటలకు తిరుత్తణి సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో పూజలు చేయించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు బస్టాండు సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద వాహనాలు సిద్ధంగా ఉంటాయని, జనసేన నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, అనిల్‌రాయల్, బాబ్జీ, సుధాకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఐడీఎస్‌తో స్విమ్స్ ఒప్పందం

తిరుపతి(వైద్యం), మే 12(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో చికిత్స పొందే రోగుల ఆరోగ్య భద్రత కోసం విశాఖపట్నంకు చెందిన ఇంటిట్యూటివ్ డేటా సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్(ఐడీఎస్) వారితో స్విమ్స్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఐడీఎస్ ప్రతినిధులతో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ సోమవారం స్విమ్స్‌లో భేటీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ ఐడీఎస్ ఒప్పందం ద్వారా స్విమ్స్‌లో ల్యాబ్, పరిశోధన, ఆవిష్కరణ, విస్తరణ అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం స్విమ్స్, ఐడీఎస్ వారు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. స్విమ్స్ నెట్‌వర్క్ ఇంజనీర్ ప్రణయ్‌తేజ, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, వైద్యాధికారులు కళావత్, రమేష్, నరేంద్ర, ముక్తేశ్వరయ్య, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి మహోన్నతమైంది

తిరుపతి(వైద్యం), మే 12(ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో నర్సింగ్ వృత్తి మహోన్నతమైందని, నర్సులు రోగులకు అందించే సేవలు ఎనలేనివని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవాన్ని స్విమ్స్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుమార్ మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి నర్సూ వైద్యసేవలు అందించాలన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధారాణి, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, వైద్య విభాగాధిపతులు ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారు నగల చోరీ

తిరుపతి(నేరవిభాగం), మే 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. మల్లంగుంటకు చెందిన చొక్కారెడ్డి నరేంద్రకుమారి ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్నారు. అర్ధరాత్రి దొంగలు ఇంటి పక్కన టెర్రస్‌లో ఉన్న చెట్టు ఎక్కి లోనికి ప్రవేశించారు. బీరువాను పగులగొట్టి 76 గ్రాముల బంగారు నగలను అపహరించారు. ఉదయం ఈ విషయాన్ని గమనించిన నరేంద్రకుమారి సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ బదిలీ

తిరుపతి(నేరవిభాగం), మే12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బాలకృష్ణను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన రాజు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు వీఆర్‌లో ఉన్న రామాంజనేయులును ఆ స్థానంలో నియమించారు.

GENERAL NOTICE

One **Sri T. Doraswamy Naidu,** S/o Chengama Naidu executed registered will deed on 26-08-2020 vide Doc. No. Book-III of 32/2020 in favour of his grand son Sri. T. Jagadish, S/o T. Kesavulu Naidu for his entire movable and immovable estate. The said T.Doraswamy Naidu died on 30-10-2023. After demise the said T.Jagadish got the entire estate by virtue of Registered will deed. " If any objections by the public or relatives, the same may be intimated to the Asst. General Manager, State Bank of India, SME Branch Tirupati.

రుయాకు వైద్య పరికరాల వితరణ

తిరుపతి(వైద్యం), మే 12 (ఆంధ్రజ్యోతి): రుయాలో ఊపిరి తిత్తుల సమస్యలతో చికిత్స పొందే రోగుల అవసరార్థం రూ.75 వేల విలువైన స్పైరోమీటర్ చికిత్స పరికరాలను సూరి ఫౌండేషన్ ఉచితంగా అందించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రౌడీ పప్పూరాయల్‌ను చితకబాదేశారు

- మందు తాగాలంటూ స్థానికులపై దౌర్జన్యానికి దిగడంతో దేహశుద్ధి

తిరుపతి(నేరవిభాగం) మే 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ అరాచకపర్వానికి ప్రతీకగా పప్పూ రాయల్ అనే పేరు అప్పట్లో ప్రతిధ్వనించింది. కార్పొరేషన్ ఆఫీసు గేటు ముందే నిలబడి టీడీపీ, బీజేపీ ప్రతినిధులను అడ్డుకోవడమే కాక బూతులు తిట్టాడు, కొందరిపై చేయి చేసుకున్నాడు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతోనూ దారుణంగా వ్యవహరించాడు. ఈ దృశ్యాలన్నీ వైరల్ అయినా ఆయన మీద నీతులు వల్లించే వైసీపీ నేతలు ఈగ వాలనీయలేదు. ఓడలు బండ్లవడంతో పప్పూ రాయల్ పారిపోయాడు. ఎంత కాలమని అజ్ఞాతంలో ఉండాలనుకున్నాడేమో.. ఆదివారం రాత్రి తిరుపతిలో మళ్లీ రౌడీ అవతారంలోనే ప్రత్యక్షమయ్యాడు. గెస్ట్‌లైన్ డేస్ హోటల్ సమీపంలోని ఒక మైదానంలో ఉన్న స్థానికులపై దబాయింపుకి దిగాడు. నా పేరు పప్పు రాయల్... నేను మందుకొట్టాలి.. ఈ గ్రౌండ్ ఖాళీచేసి వెళ్లిపోండి.. అంటూ తన అనుచరులు కొందరితో కలిసి జనంమీదకు వచ్చాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతను నోటికొచ్చినట్టు మాట్లాడుతూ ఉండడంతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. సుగుణమ్మనే తరిమికొట్టిన వాడిని అంటూ స్థానికులపై దాడికి దిగాడు. ఈ సమాచారం తెలిసి మరికొందరు అక్కడికి చేరుకున్నారు. దాంతో సహనం నశించిన వారు పప్పూ రాయల్‌కు దేహశుద్ధి చేశారు. చేతులతో, కాళ్లతో, కర్రలతో చితకబాదారు. అడ్డు వచ్చిన అనుచరుడికీ దెబ్బలు పడ్డాయి. పప్పూ రాయల్‌ని ఉతికేశారు అంటూ ఈ వీడియో వైరల్ అయ్యింది. అధికారంలో ఉన్నపుడు మన్నూ మిన్నూ కానకుండా రౌడీయిజం ప్రదర్శించినవాడికి చివరికి ఈ గతి పట్టింది కదా అని జనం చర్చించుకున్నారు. కొసమెరుపు ఏమిటంటే ఈ సంఘటన మీద పోలీసులకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదు.

ఇంటి స్థలంపై రగడ


పట్టా చూపుతున్న బాధితులు

తిరుపతి అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ మండలం మంగళం లెక్కదాఖల సప్తగిరికాలనీ సచివాలయానికి సమీపంలో నాలుగు సెంట్ల స్థలం (రెండు ఇంటి జాగాలు) విషయమై సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. జె.నాగరాజు కుమారుడు మురళి సోమవారం ఉదయం ఆ స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. కొంత సమయానికి అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత ఈ స్థలం తనదని, తాను రిజిస్ట్రేషన్ చేసుకున్నానని, ఇందులో ఎందుకు నిర్మాణం చేపడుతున్నారని నిలదీశాడు. ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. మురళి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ జగన్నాథంరెడ్డి విచారణ ప్రారంభించారు. బాధితుడు మురళి మీడియాతో మాట్లాడుతూ తన తండ్రి నుంచి సంక్రమించిన ఈ స్థలాన్ని 2023లో ఇదే కాలనీకి చెందిన 10వ వార్డు మెంబర్, వైసీపీ నేత వి.ఆర్.మురుగేష్, ఆయన తండ్రి నాగయ్య కలిసి నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించే ప్రయత్నం చేశారన్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని కాపాడుకున్నామని, ఇప్పుడు టీడీపీ నాయకులు అదే పని చేస్తున్నారని ఆరోపించారు. ఆర్డీఐ, స్పందన ద్వారా రికార్డులు పరిశీలించగా అవి నకిలీవని తేలిందన్నారు. అధికారులు స్పందించి, న్యాయం చేయాలని కోరారు.

స్విమ్స్ రోగులకు ఫ్రీ అంబులెన్స్


ఉచిత అంబులెన్స్ సర్వీస్ ప్రారంభోత్సవంలో టీడీపీ నేతలు

తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి) : శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో వైద్యం కోసం వచ్చే రోగులకు ఉచిత అంబులెన్స్ సర్వీసు ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర ఫ్రీ అంబులెన్స్ సర్వీస్ పేరిట ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహయాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఊక విజయ్‌కుమార్, మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్, టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణ, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు బిజి కృష్ణ యాదవ్, ఆనంద్ యాదవ్, యశ్వంత్ రెడ్డి, కొట్టే హేమంత్ రాయల్, శంకర్ యాదవ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ స్విమ్స్‌లో చికిత్స పొందే నిరుపేదలు దూరప్రాంతాలకు రోగులను తీసుకువెళ్లేందుకు ప్రైవేటు అంబులెన్సుల కోసం వేల రూపాయలు ఖర్చు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారి కోసం రెండు ఉచిత అంబులెన్సులను అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు.

క్రీడా సామగ్రి పంపిణీ


సామగ్రిని అందజేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), మే 12(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొంటున్న వారికి వివిధ రకాల సామగ్రిని సోమవారం శాప్ చైర్మన్ రవినాయుడు పంపిణీ చేశారు. 50 కేంద్రాల కోచ్‌లు, పీడీలను పిలిపించి అందజేశారు. శిక్షణ శిబిరాలను గతంలో కంటే మెరుగ్గా నిర్వహించాలని కోరారు. పారిశ్రామిక సంస్థలను, ప్రముఖ దాతలను సంప్రదించి క్రీడలకు సహకరించేలా ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బాలాజీ, సయ్యద్‌సాహెబ్, కోచ్‌లు పాల్గొన్నారు.



స్కేటింగ్ క్రీడాకారిణికి అభినందన

ఢిల్లీలోని జీఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా గతనెల 29నుంచి ఈనెల 5వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ 19 స్కేటింగ్‌లో తిరుపతికి చెందిన కె.స్నేహకృతి బంగారు పతకం సాధించారు. సోమవారం సాయంత్రం ఆమె శాప్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలవగా ఆయన అభినందించారు. శాప్ నుంచి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

రేపు విశ్వంలో సైనిక్, నవోదయపై సదస్సు

తిరుపతి(విద్య), మే 12(ఆంధ్రజ్యోతి): వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. 4-9 తరగతులు చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై ప్రవేశపరీక్ష విధానం, అర్హత వంటి విషయాలపై అవగాహనతో పాటు సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 8688888802, 9399976999లను సంప్రదించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 8మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన ఎనిమిది మందికి జరిమానా విధిస్తూ తిరుపతి అదనపు జిల్లా న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఎనిమిది మందికి రూ.80వేలు జరిమానా విధించారు.

భక్తులతో స్నేహంగా మెలగాలి

తిరుపతి(నేరవిభాగం), మే 12 (ఆంధ్ర జ్యోతి): గంగ జాతరలో భక్తుల పట్ల స్నేహ పూర్వకంగా మెలగాలని అదనపు ఎస్పీ రవి మనోహరాచారి ఆదేశించారు. డీఎస్పీ భక్తవత్సలంతో కలసి సోమవారం ఆయన పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ క్యూలలో తొక్కిసలాట చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలను నిర్దయించిన ప్రాంతాల్లో మాత్రమే పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ భక్తవత్సలం మాటాడుతూ రద్దీకి అనుగుణంగా దర్శనం త్వరితగతిన పూర్తి చేసి, బయటకు పంపే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు ప్రసాద్, శ్రీలత, రామకృష్ణమాచారి, సీఐలు శ్రీనివాసులు, రామయ్య, రాంకిషోర్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీటీఎంగా విశ్వనాథ్



తిరుపతి(ఆర్టీసీ), మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ తిరుపతి ఇన్‌చార్జ్ డిప్యూటీ సీటీఎంగా ఉన్న పి.విశ్వనాథంకు పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇదే పదవిలో ఉన్న భాస్కర్‌రెడ్డి 2024 నవంబరులో ఉద్యోగ విరమణ చేశారు. దాంతో తిరుమల డిపో మేనేజర్‌గా ఉన్న విశ్వనాథానికి డిప్యూటీ సీటీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించడంతో పలువురు అధికారులు, యూనియన్ నాయకులు ఆయన్ను అభినందించారు.

వైభవంగా పుష్పయాగం



తిరుపతి అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరాలయంలో సోమవారం పత్ర పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని మేల్కొలిపి అభిషేకం, అనంతరం ఉత్సవర్లకు నవకలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 10-12గంటల మధ్య పత్రపుష్పయాగం చేపట్టారు. చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, కనకాంబరం, బిల్వం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి 2 టన్నుల పత్రాలు, 2 టన్నుల పుష్పాలు దాతలు విరాళంగా అందించారు. ఆలయంలో అర్చక పరిచారకులు, అధికార అనధికారులు, భక్తుల వల్ల ఏవైన లోపాలు జరిగివుంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్ర పుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఏఈవో రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు

వైభవంగా వైశాఖ పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో సోమవారం వైశాఖ పౌర్ణమి గరుడ సేవ వైభవంగా జరిగింది. మలయప్పస్వామిని విశేషంగా అలంకరించారు. రాత్రి 7 గంటలకు ప్రియ వాహనుడు గరుడునిపై స్వామి కొలువుదీరి విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని మలయప్పస్వామిని దర్శించుకున్నారు. గ్యాలరీల్లోని భక్తుల గోవిందనామస్మరణలు, కర్పూర హారతుల వెలుగులతో మాడవీధులు శోభాయమానంగా దర్శనమిచ్చాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 10 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.40 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న

భక్తులు: 80,423

తలనీలాలు సమర్పించినవారు: 29,361





పొర్లు దండాల మొక్కులు

సోమవారం అర్ధరాత్రి దాటాక మార్కెట్‌లోపల పొంగళ్లు పెడుతున్న భక్తులు

వేప చీరలతో దర్శనానికి..

దీవించమ్మా.. గంగమ్మ

ఇద్దరు కైకాల కులస్థులు సున్నపు కుండల వేషధారణతో గంగమ్మను దర్శించుకున్నారు. మిగిలిన భక్తులు చిత్ర, విచిత్ర వేషాలను ధరించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వేప చీరలు ధరించి కొందరు.. పొర్లు దండాలతో మరికొందరు గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





ఆస్తులు పంచేశాను

పిల్లలు చూడడం లేదు ● సబ్‌కలెక్టర్‌కి విన్నవించుకున్న విశ్రాంత పోలీసు



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అర్జీదారుడు

గూడూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): 'నా భార్య చనిపోయింది. ఉన్న ఆస్తిని కుమారుడు, కుమార్తెకు పంచి పెట్టాను. వృద్ధాప్యంలో వాళ్లు నన్ను చూడటం లేదు' అని కోట మండలం విద్యానగర్‌కు చెందిన విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ మస్తానయ్య ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందించారు. తనకు జీవనం ఇబ్బందికరంగా మారిందని, సీనియర్ సిటిజన్ యాక్ట్ ద్వారా న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 526 మంది గైర్హాజరు



ఎస్వీ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం మొదలైన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు 526 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ఫస్టియర్ పరీక్షలకు 7,427 మందికిగాను 448 మంది. మధ్యాహ్నం జరిగిన సెకండియర్ పరీక్షలకు 848 మందికి గాను 78 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

డిపో నిర్వహణ ఇలాగేనా..!

సిబ్బంది కొరతైతే ఓడీల్లో ఎందుకున్నారు? ● ఆర్టీసీ అధికారుల తీరుపై జోనల్ చైర్మన్ అసహనం

సూళ్లూరుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): 'డిపో నిర్వహణ ఇలాగేనా? కార్యాలయ సిబ్బంది 11 గంటలైనా ఎందుకు రాలేదు? పరిసరాలు ఇలాగేనా ఉండేది? అధికారులు ఏం చేస్తున్నారు?' అంటూ ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నారెడ్డి సురేష్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సూళ్లూరుపేట డిపోను సోమవారం తనిఖీ చేసిన ఆయన.. 11 గంటలైనా సిబ్బంది రాకపోవడాన్ని గుర్తించారు. ఉదయం 5 గంటలకు విధుకు హాజరుకావాల్సిన సూపర్‌వైజర్ రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సు సర్వీసుల వివరాలను అక్కడున్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డిపో నిర్వహణతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, గత వైసీపీ సర్కారు ఆర్టీసీ ఆస్తులను సైతం తాకట్టు పెట్టి సంస్థను నిర్వీర్యం చేసిందని, దానిని సరిదిద్ది పూర్వవైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే ఎలాగని ప్రశ్నించారు. డిపోలో తగినంత మంది సిబ్బంది లేనప్పుడు కండక్టర్లు, డ్రైవర్లను ఓడీల్లో ఎందుకు ఉంచుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన విజిలెన్స్ విచారణ నివేదిక తెప్పించుకొని డిపో నిర్వహణను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరణి విజయ భాస్కర్ రెడ్డి, తన్నీరు శేషగిరిరావు, తాటిపర్తి ఆదినారాయణరెడ్డి, విజయమ్మ పాల్గొన్నారు.



డిపోను పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు

ఈ-సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురండి



అధికారులకు సూచనలిస్తున్న హెల్త్ కమిషనర్ వీరపాండ్యన్

తిరుపతి(వైద్యం), మే 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తిరుపతి రుయాస్పత్రిలో ఈ సెంట్రల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. రుయాస్పత్రిని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైక్రో బయాలజీ, బయో కెమిస్ట్రీ, పెథాలజీ, ఎంఆర్ఐ, రేడియాలజీ విభాగాలను పరిశీలించారు. తక్షణమే వైద్య పరీక్ష ఫలితాలను అందించేందుకు ఈ-సిటీ డయాగ్నోసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. 24 గంటలు నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఈ సెంట్రల్ ల్యాబ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. మందులు, వైద్య పరికరాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ డీఎస్ఎన్ మూర్తి, వైద్యులు మాధవీలత, శ్రీధర్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి బలి



మృతిచెందిన ఇరుదైనాథన్ డేవిడ్

తడ, మే 12 (ఆంధ్రజ్యోతి): తడ సున్నపుగుంట ప్రాంతానికి చెందిన ఇరుదైనాథన్ డేవిడ్ అలియాస్ చెందు(22) పిడుగుపాటుకు బలయ్యాడు. సోమవారం మధ్యాహ్నం పల్లిపాళెం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో స్నేహితులు భాను, విజయ్, వంశీ, గుణ, మరియదాసులతో కలిసి క్రికెట్ ఆడుతుండగా పిడుగుపడింది. ఇరుదైనాథన్ డేవిడ్ స్పృహ తప్పిపడిపోవడంతో వెంటనే శ్రీసిటీ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు.

మేము సైతం

● ఇండియన్ ఆర్మీకి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున రూ.3.15లక్షలు



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్

తిరుపతి(కలెక్టరేట్), మే 12(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన భారత సైన్యానికి తిరుపతి ఆటోమొబైల్ అసోసియేషన్ తరపున రూ.3.15 లక్షల చెక్కును విరాళంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం హోండా మోటార్స్ పృధ్వీ ఇతర ఆటోమొబైల్ డీలర్లతో కలిసి కలెక్టర్‌కు చెక్కు అందజేశారు.

అర్ధరాత్రి ప్రమాదం

● ఆటోను ఢీకొన్న టిప్పర్

● 8 మంది తమిళనాడువాసులకు తీవ్ర గాయాలు



గాయపడిన రవిచంద్రన్ - కుమారవేల్

శ్రీకాళహస్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలం పదో మైలు వద్ద సోమవారం అర్ధరాత్రి ఆటోను టిప్పర్ ఢీకొనడంతో 8 మందికి తీవ్ర.. ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం పెరంబూరుకు చెందిన 11 మంది శ్రీకాళహస్తీశ్వరుడి దర్శనానికి సోమవారం బస్సులో వరదయ్యపాళేనికి వచ్చారు. అక్కడ్నుంచి ఆటోలో శ్రీకాళహస్తికి బయలుదేరారు. పదో మైలు వద్ద వీరి ఆటోను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. క్షతగాత్రులను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని తిరుపతి రుయాకు పంపించారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం



కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేస్తున్న యూటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు

తిరుపతి(విద్య) మే 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని యూటీఎఫ్ నాయకులు స్పష్టం చేశారు. బదిలీలు, పదోన్నతుల విషయంలో ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ సోమవారం ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీజే రాజశేఖర్, ముత్యాలరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవోను రద్దుచేసి కొత్త జీవో విడుదల చేసిన తర్వాత మాత్రమే పాఠశాలలను పునఃసమీక్షించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, ఐదు తరగతులు బోధించడానికి ఐదుగురు ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాలల్లో నియమించాలని డిమాండ్ చేశారు. ఉర్దూ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్టీటీ స్కూల్ అసిస్టెంట్లతో కలిపి లెక్కించి ఆ మేరకు పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. ఇలా మొత్తం 13 డిమాండ్లను వివరిస్తూ తక్షణం వాటిని పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులు కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారి మోహన్‌బాబు, నాయకులు సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శులు బండి మధుసూదన్‌రెడ్డి, సురేష్, మస్తానయ్య, పద్మజ, హేమాంబరధరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



ప్రత్యేక అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లు

చిల్లకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామికి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, కల్యాణం జరిపారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై ఉంచి పూజలు నిర్వహించి ఆలయ ఆవరణలో ఊరేగించారు. కందల సుధాకర్, నీరజమ్మ, రావుల వెంకటేశ్వర్లుగౌడ్, ధనమ్మ, అనిశెట్టి సుబ్రహ్మణ్యంశెట్టి, అన్నాడి కృష్ణయ్యశెట్టి, సుబోష్‌శెట్టి, అనిశెట్టి గురునాథం, అన్నాడి లోకనాథం, వరిదిరెడ్డి రామ్‌మోహన్‌రెడ్డి, గిరిజ, యల్లంటి ప్రభాకర్‌రెడ్డి, సులోచనమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న సురేష్‌రెడ్డి

నాయుడుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్ సన్నపు సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం నాయుడుపేట బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఉన్న కుళాయిల నుంచి తాగునీరు రాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నట్లు గుర్తించారు. శిథిలావస్థకు చేరుకున్న బస్టాండ్‌లో పరిస్థితులను ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లి నూతనంగా బస్టాండ్ నిర్మించేందుకు కృషి చేస్తానని చెప్పారు. బస్టాండ్ ప్రాంగణంలో శుభ్రత పాటించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంగినేని కృష్ణయ్య, అమరావతి రామయ్య, సురేంద్ర, రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నానాబాల సుబ్బారావు, ధనంజయ, వెంకటేశ్వర్లు, నారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు ఎనలేనివి



ఫ్లోరెన్స్‌నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యసిబ్బంది

గూడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): రోగులకు నర్సులు అందించే సేవలు ఎనలేనివని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. సోమవారం అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి వద్ద మైథిలి నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆస్పత్రి నుంచి టవర్‌క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నర్సులు చేసే సేవలు ఎంతో గొప్పవన్నారు. డాక్టర్లు కొంత సమయం మాత్రమే రోగుల వద్ద ఉండి సూచనలు అందిస్తారని, నర్సులు నిరంతరం సేవలు అందించడం వారిలోని సేవాగుణానికి తార్కాణమన్నారు. డాక్టర్ హిమైషి, మైధిలి రమణబాబు, మస్తాన్, గౌరీ, వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



రైతులకు బహుమతులు అందజేస్తున్న పశువైద్యాధికారులు

వెంకటగిరి, మే 12:(ఆంధ్రజ్యోతి) నెల్లూరు జిల్లా కోవూరు పశుగణాభివృద్ధి సంస్థ, వెంకటగిరి ప్రాంతీయ పశువైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బొప్పాపురంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా అమలు చేస్తున్న జాతీయ కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్య దూడల ఉత్పత్తితో రైతులు మేలు జాతి దూడల పెంపకాన్ని చేపట్టి ఆదాయాన్ని పెంచుకోవాలన్నారు. సహాయ సంచాలకుడు స్వామిబాబు దూడల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ప్రదర్శనలో పాల్గొన్న దూడల్లో ఉత్తమ జాతి దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు కిషోర్ కుమార్, శ్రీనివాస సేవాసంస్థ ప్రతినిధులు, పాడి రైతులు పాల్గొన్నారు.

అభయ శంకరుడి ఆలయంలో పౌర్ణమి వేడుకలు



పుష్పాలంకరణలో స్వామివారు

సూళ్లూరుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో చైత్రపౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. అనంతరం పుష్పాలతో అలంకరించి పూజల అనంతరం జ్యోతుల హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

చెరువులో ఆక్రమణలను తొలగించండి

వాకాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): వాకాడు చెరువులో ఆక్రమణలను తొలగించాలని రైతులు సోమవారం తహసీల్దారు రామయ్యకు వినతిపత్రం అందజేశారు. కొందరు చెరువును ఆక్రమించి పంట పొలాలుగా మార్చేశారన్నారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గిపోయి నీటినిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బాలసదన్‌లో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కోట, మే 12 (ఆంధ్రజ్యోతి): కోటలోని బాలసదన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూపరింటెండెంట్ దుర్గాదేవి కోరారు. పార్ట్‌టైం ప్రాతిపదికన పనిచేసేందుకు వంట మనిషి, నైట్ వాచ్ ఉమెన్, ఎడ్యుకేటర్, పీఈటీ, యోగా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9553899070 నెంబరును సంప్రదించాలని సూచించారు.

వెంకటగిరిలో...

వెంకటగిరి: పట్టణంలోని రాణీపేటలో ఉన్న బాలసదనంలో ఖాళీగా ఉన్న పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు సూపరింటెండెంట్ కమలమ్మ తెలిపారు. కుక్, నైట్ వాచ్‌ఉమెన్, ఎడుకేటర్, ఆర్ట్‌క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్, పీటీ, యోగా టీచర్ పోస్టులు కాళీగా ఉన్నాయని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9951617968 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

15న వాకాడు మండల మీట్

వాకాడు, మే 12 (ఆంధ్రజ్యోతి): వాకాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్త్రీశక్తి భవనంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.



హాకీలో మెలకువలు నేర్పుతున్న కోచ్ దీపక్‌ఆకాష్ - క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్న కోచ్ లవకుమార్

వేసవి శిక్షణ శిబిరాలతో క్రీడా వికాసం

గూడూరు, మే 12(ఆంధ్రజ్యోతి): వేసవి ఉచిత శిక్షణ శిబిరాల నిర్వహణతో క్రీడా వికాసం మెరుగుపడుతోంది. వేసవి సెలవుల్లో విద్యార్థులకు పలు క్రీడల్లో శిక్షణ ఇస్తుండడంతో క్రీడాకారులు నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు. గూడూరు పట్టణంలోని ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ(శాప్) ఆధ్వర్యంలో హాకీ, గూడూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్‌లో ఉచితంగా శిక్షణ అందజేస్తున్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ఈ శిబిరాలకు పంపేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

హాకీకి ప్రత్యేక స్థానం

గూడూరు నుంచి పలువురు సీనియర్ క్రీడాకారులు జాతీయ స్థాయి హాకీ పోటీల్లో రాణించడంతో పాటు స్పోర్ట్స్ కోటా కింద ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. దీంతో హాకీ పట్ల స్థానిక క్రీడాకారుల్లో ఆసక్తి పెరిగింది. శాప్ కోచ్ దీపక్ ఆకాష్ క్రీడాకారులకు హాకీలో మెలుకులను నేర్పుతూ తర్ఫీదు ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు జశ్వంత్, సుమంత్, భార్గవ్, లక్ష్మీవరప్రసాద్, ఇస్మాయిల్, శాంతకుమార్, హనుమంతు, మసూద్ జాతీయ స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ చాటారు. అదేవిధంగా హాకీలో రాణించిన మణికంఠ, ఏరోన్ ఆడిట్ జనరల్ విభాగంలో, అయ్యప్ప, శ్రావణ్, సందీప్, సనత్‌కుమార్ ఆర్మీలో, సుధాకర్, అనీల్, చిరంజీవి పోలీస్‌శాఖలో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు చేస్తున్నారు. అలాగే కోచ్‌లుగా లక్ష్మీనారాయణ, దీపక్‌ఆకాష్, చెందు, అశోక్ శాప్‌లో పనిచేస్తున్నారు.

క్రికెట్ శిక్షణకు ఆధునిక సౌకర్యాలు

గ్రామీణ క్రీడాకారులను క్రికెట్‌లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో గూడూరు క్రికెట్ క్లబ్‌ను ఏర్పాటు చేసి నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్ సబ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రత్యేకంగా నెట్‌తో పాటు యాస్ట్రో టర్ఫ్ పిచ్ ఏర్పాటు చేసి కోచ్ లవ కుమార్ క్రీడాకారులకు మెలుకువలను నేర్పుతూ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారుల్లో లీలా వికాష్ అండర్ -14 విభాగంలో రాష్ట్ర ప్రాబబుల్స్‌కు ఆడారు. అండర్ -12 విభాగంలో మౌనిష్, అండర్ -14 విభాగంలో జాన్ బెన్నీ, అండర్-16లో పూర్ణయశ్వంత్‌రెడ్డి, చైతన్య జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. గతంలో హాకీ, క్రికెట్‌లో శిక్షణ పొందాలంటే ఇతర నగరాలకు వెళ్లాల్సివుండేది. గత 12 ఏళ్లుగా గూడూరులోని ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో హాకీ, క్రికెట్‌లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణంతో పాటు సమీప గ్రామాల యువత నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఉత్తమ క్రీడాకారులుగా రాణిస్తున్నారు.

జోరందుకున్న వరినాట్లు



పెళ్లకూరు మండల కొత్తూరులో వరినాట్లు వేస్తున్న మహిళలు

పెళ్లకూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు, పసుపుకండ్రిగ, చింతపూడి, యడపూడి, జీలపాటూరు, చావాలి, రావులపాడు, పుల్లూరు, కలవకూరు, పెన్నేపల్లి తదితర గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. ఏటా మే, జూన్ మాసాల్లో వరిసాగు ప్రారంభమవుతుంది. ఈ ఏడాది వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండి పెద్దగా వర్షాలు కురవకపోవడంతో సాగు పనులు మందకొడిగా సాగుతున్నాయి. వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని అడపా దడపా వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో ఎడగారు సాగుపై ఆశలు చిగురించాయి. ఇప్పటికే నార్లు సిద్ధం చేసుకున్న రైతులు వరినాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో లేకపోవడంతో నాయుడుపేట, శ్రీకాళహస్తి పట్టణాల్లో ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోట: మండలంలోని స్వర్ణముఖినది పరివాహక గ్రామాల్లో ఎడగారు వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఏటా ఏప్రిల్, మే మాసాల్లో ఎడగారు వరిసాగు రైతులు చేపడుతారు. గత ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. ప్రధానంగా గూడలి, దక్షణపొలం, రాజుపాళెం, తిన్నెలపూడి, తాటితోపు, వెంకన్నపాళెం, చిట్టేడు, రుద్రవరం గ్రామాల్లోని స్వర్ణముఖినది సమీపంలో ఉన్న ఫిల్టర్ పాయింట్‌లు, నేలబావుల కింద రైతులు ఏడగారు వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా 1010 రకం, నెల్లూరు జిలకర్ర, సన్నాల సాగు చేస్తున్నారు.

వెంకటగిరిలో ఆరు సింగిల్ విండోలకు పర్సన్ ఇన్‌ఛార్జుల మార్పు

తిరుపతి, మే 12(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు సింగిల్‌విండోలకు కొత్తగా అఫిషియల్ పర్సన్ ఇన్‌ఛార్జులను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాధవాయపాలెం, కుందం, లాలాపేట, జయంపు, మోపూరు, డక్కిలి సింగిల్‌విండోలకు గతేడాది 19న వెంకటగిరి సీనియర్ సహకార ఇన్‌స్పెక్టర్ డి.మాధవిని అఫిషియల్ పర్సన్ ఇంఛార్జిగా నియమించగా, ఆమె అనారోగ్యంతో గత నెల 23న మృతి చెందారు. పర్సన్ ఇంఛార్జిగా ఆమె పోస్టు గడువు వచ్చే నెల 20వ తేదీ దాకా ఉంది. దీంతో ఆమె స్థానంలో ఈ విండోలకు కొత్త పర్సన్ ఇంఛార్జులు నియమితులయ్యారు. మాధవాయ పాలేనికి వెంకటగిరి జూనియర్ ఇన్‌స్పెక్టర్ పి.నజరిన్, కుందం, లాలాపేట విండోలకు గూడూరు జూనియర్ ఇన్‌స్పెక్టర్ పి.మహేశ్ సింగ్, జయంపు విండోకు గూడూరు సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్యామ్ కుమార్, మోపూరు, డక్కిలి విండోలకు గూడూరు జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం.అర్కినాధన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర సహకార శాఖ ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

నాయుడుపేట మున్సిపల్ కమిషనర్‌కు పదోన్నతి

తిరుపతి, మే 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు పదోన్నతి లభించింది. గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం పదోన్నతి ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 11 మందికి పదోన్నతులు లభించగా అందులో జిల్లా నుంచీ ఫజులుల్లా వున్నారు. పదోన్నతిపై ఆయన్ను నాయుడుపేటలోనే కొనసాగిస్తూ సోమవారం మున్సిపల్ పరిపాలనాశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

అవినీతిని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించం: పాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు అవినీతికి పాల్పడినా, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా సహించేది లేదని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు అనంతరం వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని గాంధీనగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో పనిచేసే ఇద్దరు వీఆర్వోలు అవినీతికి పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు సకాలంలో అందించాలన్నారు. సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను కార్యాలయాలకు తిప్పుకోవడం, నగదు వసూళ్లకు పాల్పడితే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి విధుల్లో జాప్యం కలుగకుండా సేవలందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. గాంధీనగర్ ప్రాంతంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని తహసీల్దారుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో మధుసూదన్‌రావు, టీడీపీ నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, పెంచలయ్య, దాము, చంద్రమౌళి, అమరయ్య, నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



విద్యార్థినిని సన్మానించి నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన 20మంది విద్యార్థులను సోమవారం సన్మానించి ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. మొదటి బహుమతి రూ.6వేలు, రెండో బహుమతి రూ.5వేలు, 3వ బహుమతి రూ.4వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖలో మార్పులు తీసుకువచ్చి పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎమ్మెల్యే విజయశ్రీ నియోజకవర్గానికి సుమారు 50 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులు ప్రారంభించారన్నారు. అనంతరం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే విజయశ్రీని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పసల గంగాప్రసాద్, షైలారి రాజశేఖర్, శ్రీనివాసులు నాయుడు, రఫీ, పొట్లపూడి రాజేష్, సుబ్బారావు, నారాయణ, సంచి కృష్ణయ్య, సుధీర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరులో తేలికపాటి జల్లులు

గూడూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం సాయంత్రం కొంతసేపు తేలిపాటి జల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఎండతీవ్రత ఉన్నా, సాయంత్రం ఆకాశం మేఘావృతంగా మారి ఈదురుగాలులతో తేలికపాటి వర్షం కురిసింది. ఈ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

పిడుగుపడి రెండు గేదెల మృతి

గూడూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగుపడి రెండు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి తన గేదెలను విందూరు సమీపంలోని చెరువులోకి మేతకు తీసుకువెళ్లాడు. సాయంత్రం పిడుగుపడడంతో రెండు గేదెలు మృతిచెందాయి. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటినట్లు బాధితుడు తెలిపారు.

వైభవంగా శ్రీరంగపెరుమాల్ కల్యాణం



కల్యాణోత్సవానికి కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

తడ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడు దీవిలో వెలసిన శృంగీశ్వర శ్రీరంగ పెరుమాల్ ఆలయంలో చైత్రపౌర్ణమి సందర్భంగా సోమవారం మహాలక్షార్చన ప్రారంభించారు. స్వామివారికి వస్త్రాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదిక పై శ్రీరంగపెరుమాల్, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఎం.శ్రీరాం మొదలి, సుదర్శన్ మొదలి, కె.శ్రీధర్, కె.హరి, సునీత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పోలేరమ్మకు తాళిబొట్టు అందజేత

నాయుడుపేట టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మకు మండలంలోని ఒద్దిగుంటకండ్రిగ గ్రామానికి చెందిన విజయకుమార్, సుమలత దంపతులు తాళిబొట్టు అందజేశారు. సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాతర కమిటీ అధ్యక్షుడు సుబ్బారావుకు తాళిబొట్టును అందజేశారు.



తాళిబొట్టు అందజేస్తున్న భక్తులు

విజయదుర్గాదేవికి ప్రత్యేక పూజలు



విజయదుర్గాదేవికి పూలతో అభిషేకం

గూడూరు అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైశాఖ పౌర్ణమి శ్రీచక్ర వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి పంచామృత సహిత పరిమళ సుగంధ ద్రవ్యాలు, పూలతో ప్రత్యేకంగా అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. రాత్రి నవావరణ హోమ పూజలను శాస్త్రోపేతంగా నిర్వహించారు. అనంతరం విజయదుర్గా స్తుతిరత్నం ఆడియో సీడీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్, తానంకి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'తల్లికి వందనం'



శ్రీలక్ష్మమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

కోట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, కొండమిట్ట, చిట్టేడు, కేశవరం, ప్రకాశంకాలనీ, చెందోడు, శ్రీలక్ష్మమ్మకాలనీ, శ్యామసుందరపురం, కోట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు తమ తల్లుల పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు.

విద్యార్థినికి నగదు బహుమతి

చిట్టమూరు, మే 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన బురదగాలి గ్రామానికి చెందిన విద్యార్థిని అశ్రితకు ఉపాధ్యాయుడు వెంకటయ్య సోమవారం నగదు బహుమతిగా అందజేశారు. నాయుడుపేటలోని పుదూరు బాలికల గురుకుల పాఠశాలలో చదివిన అశ్రిత పదో తరగతి ఫలితాల్లో 544 మార్కులు సాధించింది. ఉపాధ్యాయుడు వెంకటయ్య బురదగాలి గ్రామంలోని అశ్రిత ఇంటికి వెళ్లి శాలువాతో సన్మానించి ఐదు వేల రూపాయలు నగదు అందజేశారు.

కరిమాణిక్యస్వామికి హనుమంత వాహనసేవ

నాయుడుపేట టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులోని శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం చప్పర ఉత్సవం, ఊంజల్‌సేవ, రాత్రి హనుమంత వాహనసేవ నిర్వహించారు.

బీజేపీ నేత వాకాటి పినతల్లి మృతి



చంద్ర వదనమ్మ అంత్యక్రియల్లో ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి

తడ, మే 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పినతల్లి చంద్రవదనమ్మ(81) ఆదివారం కన్నుమూశారు. తడ మండలం చేనిగుంటలోని నివాసం ఉంటున్న ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చంద్ర వదనమ్మ మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు సోమవారం వాకాటి నారాయణరెడ్డి ఇంటికి చేరుకొని ఆయన పినతల్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్, ప్రభుత్వ సలహాదారు జి.సతీష్ రెడ్డి, సూళ్లూరుపేట, కావలి ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, కావ్యాకృష్ణారెడ్డి తదితరులు చంద్ర వదనమ్మకు నివాళులర్పించారు.

నాగశక్తి పీఠం స్థాపనకు భూమిపూజ



ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కోట, మే 12 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు రాజరాజేశ్వరి ఆల య ప్రాంగణంలో నాగశక్తి పీఠ స్థాపనకు సోమవారం భూమిపూజ జరిగింది. దేవ ప్రయాగ నాగశక్తి పీఠం ఉత్తరాధికారి చిదానంద మహరాజ్ హోమాలు నిర్వ హించి భూమిపూజ చేశారు. వేద పండితుల యజ్ఞయాగాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధాకర్, రాజారత్నం, కోటయ్య, విజయశంకర్, సుబ్బమ్మ, వెంకటేశ్వర్లు, సురేష్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా బైక్‌ల ఢీ: ఇద్దరి మృతి


ప్రమాదంలో మృతి చెందిన గులాబ్

సత్యవేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు ద్విచక్ర వాహనదారులు మృతి చెందారు. ఈ సంఘటన నాగలాపురం మండలం బయట కొడియంబేడు ఎస్టీ కాలనీ మలుపు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ సునీల్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం వైశాలి జిల్లా దుర్గాపూర్‌కి చెందిన ఎండీ. గులాబ్ (22) స్థానికంగా చెన్నై - పుత్తూరు హైవేపై బయట కొడియంబేడు వద్ద పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి గులాబ్ తన ద్విచక్ర వాహనంలో అచ్చమనాయుడు కండ్రిగలోని దాబాకు వెళ్లి భోజనం చేసి తిరిగి వస్తుండగా అదే సమయంలో ఎదురుగా వచ్చిన బయటకొడియంబేడు ఎస్టీ కాలనీకి చెందిన టి.మణి(38) ద్విచక్రవాహనం మలుపు వద్ద పరస్పరం ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు అదుపు తప్పి రోడ్డుపై పడడంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అన్నమయ్య జిల్లావాసి దుర్మరణం

శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందగా, మరో యువకుడు గాయపడ్డాడు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు... అన్నమయ్య జిల్లా చిట్వేలు మండలం పత్తిగుంటవారిపల్లెకు చెందిన సుధాకర్ రాజు(27), శ్రీనివాసరాజు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ద్విచక్ర వాహనంపై రెండు రోజుల క్రితం తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు ఇద్దరు విచ్చేశారు. దర్శనానంతరం సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని దర్శించుకునేందుకు బయలుదేరారు. ఈ క్రమంలో పట్టణ శివార్లలోని అర్ధనారీశ్వరాలయ సమీపంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి పక్కన రక్షణ గోడను ఢీకొట్టారు. ఈఘటనలో సుధాకర్‌రాజు దుర్మరణం చెందాడు. శ్రీనివాసరాజు స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా మార్చ్యురీకి తరలించారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చివోలు సచివాలయంలో సోమవారం ఆధార్‌కార్డు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రామ సచివాలయ కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలు ఆధార్‌లో తప్పొప్పులను సరిచేసుకోవచ్చన్నారు. అదే విధంగా పిల్లల ఆధార్ కోసం తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కొత్త రేషన్‌కార్డులకు ఆధార్‌కార్డు అవసరం కావడంతో ప్రజలు ఎండను సైతం లెక్కచేయక నమోదు కేంద్రానికి చేరుకున్నారు. అందుకు తగిన ఏర్పాట్లును సచివాలయ సిబ్బంది చేశారు.

గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ

బుచ్చినాయుడుకండ్రిగ, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో అధిక శాతం ఉన్న గిరిజనుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ ఎం.సుబ్బలక్ష్మి ఎంపీడీవో వెంకటరత్నమ్మను కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవోను సోమవారం ఎంపీపీ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు విద్యానాథరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో గిరిజనులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు అనేక మందికి అందడం లేదన్నారు. కార్యదర్శుల ద్వారా సర్వే చేసి అర్హులైన గిరిజనులకు పథకాలు అందేలా చూడాలన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు వద్ద సోమవారం ఎంజీఎం ఆస్పత్రి, బిగ్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు వందమంది పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ... ప్రతిరోజు గంటపాటు నడవడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు వివేక్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిన్నకొట్టాయి ఉత్సవం



శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం సోమవారం ముగిసింది. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మ వార్లకు పూజలుచేసి ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య చప్పరాలపై అధిష్ఠింప చేసి పట్టణంలో ఊరేగించారు.

పుత్తూరు వార్తలు

చింతకాల్వ రోడ్డు సమస్యకు పరిష్కారం


రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే తదితరులు

వడమాలపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా రోడ్డు వసతి లేక అవస్థలు పడుతున్న చింతకాల్వ గ్రామస్తుల సమస్య ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో పరిష్కారమైంది. పత్తిపుత్తూరు- చింతకాల్వ రోడ్డు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక గుంతలు మయమైంది. దీనిపై రెండు గ్రామాల ప్రజలు ఎన్నో పర్యాయాలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకపోయింది. ఎన్నికల ప్రచారంలో చింతకాల్వకు వచ్చిన భానుప్రకాష్‌కు గ్రామస్తులు తమ సమస్యను వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ.70 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఈక్రమంలో సోమవారం పత్తి పుత్తూరు - చింతకాల్వ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, వెంకటయ్య, రవినాయుడు, లక్ష్మీప్రసన్న, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రోటీన్ ఆహారంతో కాల్షియం లోపానికి చెక్


భవన నిర్మాణానికి చెక్కును అందిస్తున్న వెంకట్రామయ్య

పుత్తూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్లు దాటిన వారికి కాల్షియం లోపంతో ఎముకల సమస్యలు తలెత్తుతాయని ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు రాజేష్ చెప్పారు. స్థానిక విశ్రాంత భవనంలో ఉద్యోగుల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మధుమేహం కూడా ఎముకల సమస్యకు దారి తీస్తుందన్నారు. ఈ సమస్య అధిగమించడానికి ప్రోటీన్లు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. నిత్యం నడక, యోగాతో జీవన ప్రమాణం పది శాతం పెరుగుతుందని తెలిపారు. కాగా విశ్రాంత భవన నిర్మాణానికి విశ్రాంత కోర్టు ఉద్యోగి వెంకట్రామయ్య రూ.50 వేల చెక్కును అందించారు. తొలుత దేశం కోసం అశువులు బాసిన మురళీనాయక్ ఆత్మశాంతికి సంఘం మౌనం పాటించింది. గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, కుప్పయ్య, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

వారాహి అమ్మవారి ఆలయంలో పౌర్ణమి పూజలు



పుత్తూరు టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమేశ్వర మంగళం సమీపంలో ఉన్న దక్షిణ కాళిఅమ్మన్ వారాహి శక్తి పీఠంలో సోమవారం చిత్రా పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, శాంతి హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తూరు స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు ఆలయంలో సేవలందించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించి, శీతల పానీయాలు అందించారు. ఆలయ చైర్మన్ మోహనమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధ్యానంతో ఏకాగ్రత

పుత్తూరు టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో ఏకాగ్రత, ఉన్నత లక్ష్య సాధన సాధ్యమని గీతాచార్య డాక్టర్ యడ్లపల్లి మోహనరావు పేర్కొన్నారు. సోమవారం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో త్రినేత్ర పిరమిడ్ ధ్యాన కేంద్రంలో నిర్వహిస్తున్న ధ్యాన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుట్టినప్పుడు అనంతమైన శక్తి సామర్థ్యాలను కలిగి ఉంటారని, ఎదిగేకొద్ది వారి ఏకాగ్రత, ఉన్నత లక్ష్య సాధనకు ధ్యానం సహకరస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ సుబ్రమణ్యం, కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రాజానగరం ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

బిల్లులు అందక ఆగిన గోకులాలు


కేవీబీపురంలో పునాదులకే పరిమితమైన గోకులం

కేవీబీపురం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో కూటమి టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాడి రైతులకు గోకులాలను అందుబాటులోకి తెచ్చింది. నాలుగు కంటే ఎక్కువ ఉన్న పశువులున్న పాడి రైతులకు గోకులాలు మంజూరు చేసింది. సుమారు 242 గోకులాలు మండలానికి మంజూరు కాగా ఇప్పటికీ ఏ ఒక్కటి పూర్తి కాలేదు. పాడి రైతులు తమ సొంత నిధులతో గోకులాలను నిర్మించుకున్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని పాడిరైతులు కోరుతున్నారు.

చిన్న శేష, హంస వాహనాలపై కల్యాణ వెంకన్న దివ్యస్వరూపం


చిన్న శేష, హంస వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనప్రాప్తినిస్తున్న శ్రీవారు

నారాయణవనం, మే 12(ఆంధ్రజ్యోతి): పద్మావతి దేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు చిన్న శేష వాహనంపై, రాత్రి హంస వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అంతకుముందు వేకువజామున 5 గంటలకు సుప్రభాతసేవతో ఆలయాన్ని తెరిచి, నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. స్వామివారిని పిల్లనగ్రోవితో వేణు గోపాలుడిగా అలంకరించి శేషవాహనంపై అధిష్ఠింపజేశారు. మేళతాళాలు, వేదమంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పు వాయిద్యాలు, గోవిందనామ స్మరణల నడుమ స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న స్వామివారికి ఉభయనాంచారులతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం నిత్యపూజలనంతరం గంట పాటు వేద, నాద, గాత్ర కచ్చేరిల నడుమ ఊంజల సేవను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం కల్పించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూప రింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య పాల్గొన్నారు.

రాజగోపురానికి చంద్ర సిందూరం



శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): పున్నమి చంద్రుడు శైవక్షేత్రమైన శ్రీకాళహస్తిలో సోమవారం రమణీయంగా దర్శనమిచ్చారు. రాజగోపురం సిగలో సిందూర వర్ణంలో సుందరంగా కనిపించిన దృశ్యం ఆకట్టుకుంది.

షర్బత్ విక్రయాలపై దుమారం



శ్రీకాళహస్తి, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ షాపింగ్ మాల్‌లో పాకిస్థాన్ పేరు అచ్చు వేసిన సీసాలో ఉన్న షర్బత్‌ను విక్రయించడంపై సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. తేరువీధిలో ఓ షాపింగ్‌మాల్‌ను కేరళవాసులు నిర్వహిస్తుంటారు. అందులో పాకిస్తాన్ పేరుతో మూతను ముద్రించిన షర్బత్ సీసా ఉన్న ఫొటోలను కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ తరువాత కాసేపటికి ఆ దుకాణంలో పాకిస్తాన్ పేరుతో కనిపించే షర్బత్ సీసాలను తొలగించారు.

కావమ్మ, మారయ్య ఆలయ మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేటలో కొలువై ఉన్న కావమ్మ, మారయ్య నూతన ఆలయంలో విగ్రహ ప్రతి ష్ఠాపన మహాకుంభాభిషేకం వేడుకగా ప్రారంభమైంది. ఈ మహాకుంభాభిషేకానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బుల్లెట్ జయశ్యామ్, కల్యాణి, ప్రకాష్, శివ, గుణ, సురేష్, మున్నారాయల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళీ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో కొలువై ఉన్న భద్రకాళి పరమేశ్వరి అమ్మవారికి చిత్రా పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ముందుగా పలు రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

విచ్చలవిడిగా రేషన్‌బియ్యం తరలింపు



ఏర్పేడు, మే 12(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ఎండీపుత్తూరు గ్రామంలో సుమారు వెయ్యి కిలోల రేషన్‌బియ్యం గ్రామాల్లో కొనుగోలు చేసి బయట ప్రాంతాల్లో అధిక ధరకు అమ్ముకుంటున్నారు. దీనిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టీటీడీ కల్యాణమండపం పనులు ప్రారంభించండి

● ఈవోకు ఎమ్మెల్యే వినతి


టీటీడీ ఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

సత్యవేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించనున్న కల్యాణ మండపం పనులను త్వరగా ప్రారంభించాలని ఈవో శ్యామలరావుకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతిపత్రం అందించారు. ఈ మేరకు సోమవారం ఉదయం తిరుపతి టీటీడీ అడ్మినిస్ట్రేటివ్ భవనానికి ఎమ్మెల్యే చేరుకుని టీటీడీ ఈవోకు, టీటీడీ చీఫ్ ఇంజనీర్, ఎస్టేట్ ఆఫీసర్లకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి తెలుగుగంగ అధికారులు తమ అభ్యంతాలను ఉపసంహరించుకుంటూ అధికారికంగా లేఖ ఇచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మండపానికి అవసరమైన స్థలం ఇవ్వడంతో పాటు టీటీడీ ఉన్నతాధికారుల సమక్షంలో ఇప్పటికే ఆ భూమిని రెవెన్యూ, తెలుగు గంగ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించి, పెగ్‌మార్క్ కూడా ఇచ్చామన్నారు. మండపం నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేస్తే సత్యవేడు ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని టీటీడీ ఈవోకు ఎమ్మెల్యే వివరించారు. తన విజ్ఞప్తికి టీటీడీ ఈవో సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా నర్సింగ్ డే వేడుకలు


నర్సులను సన్మానిస్తున్న కోట వినుత

శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు గురవయ్య ఆధ్వర్యంలో నర్సింగ్ సిబ్బందిని సత్కరించారు. విధి నిర్వహణలో వారు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నర్సులు విజయకుమారి, అన్నపూర్ణ, ఏఐటీయూసీ నాయకులు గోపి, డిల్లీబాషా, నిజాముద్దీన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

● అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని నర్సులను ఘనంగా సన్మానించారు. వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్యసామాన్యమైనవన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, నాగరాజు, జగదీష్, రవికుమార్‌రెడ్డి, పేట చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినుత ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో నర్సులను ఘనంగా సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో చిత్రా పౌర్ణమి పూజలు



పిచ్చాటూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరిలో కొలువై ఉన్న అంకాళపరమేశ్వరి ఆలయంలో సోమవారం చిత్రా పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు పాలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఊంజల్ మండపంలో ఊంజల సేవ నిర్వహించారు. ● మండలంలోని సిద్ధిరాజు కండ్రిగ సోమనాథేశ్వర ఆలయంలో మహా రుద్రాభిషేకం, గోవర్ధనగిరి వెంకయ్యస్వామి ఆలయంలో కూడా చిత్రా పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. రెండు ఆలయాల్లోను మహిళలతో మంగళ గౌరి వ్రతం నిర్వహించారు.

వైభవంగా సుమంగళి పూజలు



సత్యవేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లెలోని పళ్లికొండేశ్వరాలయంలో సోమవారం చిత్రా పౌర్ణమి సందర్భంగా సుమంగళి పూజలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామిఅమ్మవార్లకు అభిషేకాల అనంతరం పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు అర్చనలు జరిపారు.

బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా భారతి

శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా భారతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాలుర జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఈమె పదోన్నతిపై బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవి పొందారు. పలువురు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎఫ్‌సీ ప్రిన్సిపాల్ రేణుకమ్మ, అధ్యాపకులు తదతరులు పాల్గొన్నారు.

బాలసదనంలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలసదనంలో అవుట్‌సోర్సు, పార్ట్‌టైం ప్రతిపాదికన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. కుక్-2 పోస్టులు, హెల్పర్, హెల్పర్ కం నైట్ వాచ్‌మన్, ఎడ్యుకేటర్, ఆర్ట్, క్రాఫ్ట్ కం మ్యూజిక్ టీచర్, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు నెం.9000106774లో సంప్రదించవచ్చు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ

సత్యవేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. అంతటితో ఆగకుండా కొత్త లేబర్ కోడ్లను అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ఉర్దూ పాఠశాల విద్యార్థులను విలీనం చేయొద్దు

రేణిగుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉర్దూ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులను ఇతర పాఠశాలల్లో విలీనం చేయొద్దంటూ ముస్లిం మత పెద్దలు సోమవారం ఎంఈవోలు ఇంద్రాదేవి, రంగనాథయ్యకు వినతిపత్రాలు సమర్పించారు. ముస్లిం నాయకుడు మునీర్ మాట్లాడుతూ... పట్టణంలోని 35 శాతం ముస్లింల పిల్లల చదువుల కోసం ఉర్దూ పాఠశాలను కొనసాగించాలని కోరారు.

ఘనంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

కేవీబీపురం, మే 12(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. రామాంజులు నాయుడు, మునస్వామియాదవ్, గోపీనాథ రెడ్డి, రాజారెడ్డి, ప్రకాష్‌నాయుడు, సర్పంచులు సురేష్, ప్రకాష్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, లోకేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ముత్తుమారియమ్మకు ప్రత్యేక పూజలు

కేవీబీపురం, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంతమైదానం వద్ద కొలువై ఉన్న ముత్తుమారియమ్మకు చిత్రా పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు తలపై కలశాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది. ఆలయ ధర్మకర్త నారాయణ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

భూ సమస్యలపై వినతుల వెల్లువ

బుచ్చినాయుడుకండ్రిగ, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం భూ సమస్యలపై వినతులను ప్రజలు అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో భూసర్వే, భూముల ఆన్‌లైన్ సమస్యలు, భూ ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. వినతులను విచారించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

15నుంచి ఏఐవైఎఫ్ సభలు

వరదయ్యపాళెం, మే 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈనెల 15 నుంచి జరిగే ఏఐవైఎఫ్ జాతీయ సభలను జయప్రదం చేయాలని యువజన నాయకుడు నాగార్జున పిలుపునిచ్చారు. వరదయ్యపాళెం బస్టాండు వద్ద ఏఐవైఎఫ్ జాతీయ సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే ఈ సభల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి తరుణ్‌కుమార్, సీపీఐ నాయకులు సిద్ధులయ్య, చంద్రశేఖర్, విద్యార్థి సంఘ నాయకులు మోహన్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.